రోడ్స్ ఫర్ రెంట్

కూటమి నాయకులా మజాకా..! వారి ఆలోచనలకు హద్దులేదు..భూములు, భవంతులు అద్దెకు ఇవ్వడం పాత చింతకాయ పచ్చడి అయిపోయింది. ఇప్పుడు ఏకంగా రహదారులనే అద్దెకు ఇచ్చేస్తున్నారు.. అవును మరి, రోడ్డు పక్కన కాస్త ఖాళీ స్థలం కనిపిస్తే చాలు... కంటైనరో, బడ్డీ కొట్టో క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. అదంతా ఉచితమనుకుంటే పొరపాటే.. డిమాండ్‌ను బట్టి రేటు ఫిక్స్ చేసి, నెలనెలా లక్షలు గుంజుతున్నారు. వడ్లపూడి ప్రాంతంలో కూటమి నేతల 'నూతన వ్యాపారం' బాగా వర్ధిల్లుతోంది. అధికార పార్టీ నాయకుల చలవతో ప్రధాన రహదారులన్నీ అక్రమ నిర్మాణాలతో నిండిపోయాయి. సచివాలయం పక్కనైనా, స్కూల్ ముందైనా బడ్డీలదే హవా.. అడిగే నాథుడే లేకపోవడంతో అక్రమార్కులే యజమానులుగా చెలామణి అవుతున్నారు. ప్రభుత్వ స్థలాలు కాస్త ఖాళీగా కనిపిస్తే చాలు.. వాటిని అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. **– కూర్మన్నపాలెం**


వడ్లపూడిలో రహదారిలో అక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం

కూటమి నేతల కొత్త పథకం | వడ్లపూడిలో అమలు | రహదారులు ఆక్రమించి షాపులకు అద్దెకిస్తున్న వైనం | లక్షల్లో వ్యాపారం | అధికార పార్టీ నాయకుల దందా | పట్టించుకోని అధికారులు


కూర్మన్నపాలెం రహదారిలో అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న దుకాణాలు


వడ్లపూడి ఆసుపత్రి వద్ద అడ్డదిడ్డంగా దుకాణాలు

వడ్లపూడి ప్రాంతంలో ప్రధాన రహదారులు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. రహదారులను అద్దెకు ఇవ్వడం ద్వారా కొందరు నెలనెలా లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. రహదారి ఎక్కడ విశాలంగా ఉంటే అక్కడ కంటైనర్లు, బడ్డీలు క్షణాల్లో వెలుస్తున్నాయి. డిమాండ్‌ను బట్టి అద్దె నిర్ణయించి వ్యాపారాలకు అప్పగిస్తున్నారు. ఇదే తంతు ఉక్కు నిర్వాసిత కాలనీలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది అధికార పార్టీ నాయకులు ఈ అక్రమ దందాలో నిమగ్నమై రెండు చేతులా సంపాదిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రధాన రహదారులన్నీ ఆక్రమణలతో నిండిపోతున్నాయి. దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

మార్కెట్ యార్డు ఖాళీ..

విడ్డూరం ఏమిటంటే, పక్కనే ప్రభుత్వం నిర్మించిన మార్కెట్ యార్డులో 64 షాపులు ఖాళీగా ఉన్నాయి. అయితే తమ అక్రమ ఆదాయానికి గండి పడుతుందనే భయంతో ఆ నాయకులే మార్కెట్ యార్డులో ఎవరినీ వెళ్లకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

అడిగే నాథుడు లేడని..

కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లోనూ రహదారులను అద్దెకు ఇస్తున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో ప్రతి ఏటా అద్దె రేట్లు పెంచేసి అక్రమదారులే లీజు ఒప్పందాలు రాసుకుంటున్నారు. కూర్మన్నపాలెంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నేతల దందా

అక్రమణదారుల్లో అధిక శాతం మంది అధికార పార్టీకి చెందిన వారే కావడంతో అధికారులు చర్యలు తీసుకోవడానికి జంకుతున్నారని తెలుస్తోంది. అవినీతికి తావులేదని, అక్రమాలు తమ దరిదాపుల్లోకి కూడా రావని గొప్పలు చెప్పుకునే వారే ఇలా అడ్డగోలుగా రహదారులను ఆక్రమించి అద్దెకు ఇవ్వడం చర్చనీయాంశమైంది.

తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు

ఆక్రమణల వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పోలీసులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి రహదారి ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


రాజీవ్‌నగర్‌లో రహదారి ప్రక్కన వెలసిన దుకాణాలు

ఆక్రమణల్లో వడ్లపూడి

ముఖ్యంగా వడ్లపూడి ప్రధాన రహదారి పూర్తిగా ఆక్రమణకు గురైంది. అక్కడ సచివాలయం, ప్రాథమిక పాఠశాలల చుట్టూ బడ్డీలు గుట్టలుగా వెలిశాయి. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు బడ్డీలు ఏర్పాటు చేసి ఒక్కోదానికి రూ. 6 వేల నుంచి రూ. 12 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నట్లు స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. వడ్లపూడి ప్రాంతానికి అనుకుని సుమారు 110 చిన్నచిన్న షాపులున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఆ నాయకుడికి నెలనెలా లక్షల్లో ఆదాయం సమకూరుతోందని స్పష్టమవుతోంది.

రహదారులు ఆక్రమించడం సరికాదు



రహదారులను ఆక్రమించి అద్దెకు ఇవ్వడం అన్యాయం. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రధానంగా వడ్లపూడి రహదారి మరీ అధ్వానంగా ఉంది.

– దుర్గపు దానప్పలు, కణితి కాలనీ

అద్దె వసూలు చేయడం తగదు



ప్రభుత్వానికి చెందిన మార్కెట్ యార్డు పక్కనే ఉన్నా రహదారినే ఎందుకు ఎంచుకుంటున్నారో అర్థం కావడం లేదు. వ్యాపారుల అవసరాన్ని అక్రమణదారులు అసరాగా తీసుకొంటున్నారు. అందువల్లే రహదారులను ఆక్రమించి అద్దెకి ఇచ్చేస్తున్నారు.

– జి.విశ్వేశ్వరరావు, తిరుమలనగర్

అధికారులు స్పందించాలి



అధికారులు పట్టించుకోకపోవటంవల్ల రహదారులను సైతం అక్రమించి వ్యాపారులకు అద్దెకు ఇచ్చేస్తున్నారు. దీనివల్ల రహదారులు రద్దీగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఎక్కడలేని సంస్కృతి వడ్లపూడిలోనే కనబడుతోంది. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవాలి.

– కె.రమేష్, గణేష్‌నగర్

క్లుప్తంగా

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతి


స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌తో బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పాండే

ఉక్కునగరం: ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై బీఎంఎస్ నాయకులు యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. బీఎంఎస్ జాతీయ కార్యదర్శి డీకే పాండేతో కలిసి స్టీల్ బీఎంఎస్ నాయకులు మంగళవారం ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేను కలిసి సమస్యలను వివరించారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని కోరారు. కార్మికులకు వేతన ఒప్పందం చేయాలన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాస్, మద్దాల పెంటారావు, జి. గురప్ప, పి. జగన్నాథం, ఎన్. గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోక్‌ఓవెన్స్ అధిక పుషింగ్స్‌లో కాంట్రాక్ట్ కార్మికులు కీలకం


పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న విభాగాధిపతి, అధికారులు, కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో 380 పుషింగ్స్ చేయడంలో కాంట్రాక్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న విభాగ ఉద్యోగులు సీహెచ్. నరసింహారావు, వి.అప్పలనాయుడులకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న దుర్గాప్రసాద్ వారి సేవలను కొనియాడారు. అనంతరం, బ్యాటరీ -4లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సేవలను గుర్తిస్తూ వారికి బహుమతులు అందజేశారు. కోక్‌ఓవెన్స్ బ్యాటరీని సొంత బిడ్డలా చూసుకుంటూ ఉత్పత్తికి సహకరిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జీఎం వైవీఆర్. శ్రీనివాస్, డీజీఎంలు బి. వేంకటేశ్వరరావు, కె. రాజగోపాల నాయుడు, సీనియర్ మేనేజర్లు తాతాపూడి శ్రీనివాసరావు, ఎస్.కె. తివారి, కార్మిక నాయకులు ముసినాడ శ్రీనివాస్, ఆనందకుమార్, ఎస్. ప్రసాద్ పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రతిరోజూ మధ్యాహ్నం వచ్చే రైళ్లలోని సాధారణ బోగీల ప్రయాణికులకు ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్లు అందించనున్నారు. ఈ మేరకు డీఆర్‌ఎం (కమర్షియల్) అనుమతిచ్చారని తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, మానవ వికాస వేదిక కన్వీనర్ ఎం.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. బుధవారం నుంచి జూన్ మూడో వారం వరకు రోజూ మధ్యాహ్నం వచ్చే సుదూర ప్రాంతాల రైళ్లలోని ప్రయాణికులకు 500 ఎంఎల్ మినరల్ వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేస్తారు. లయన్స్ క్లబ్, మానవ వికాస వేదిక, స్పందన చేయూత ఫౌండేషన్, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, మానవతా చారిటబుల్ ట్రస్ట్, సత్యసాయి సేవా ట్రస్ట్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాయి. రోజూ 500 మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించాలని నిర్ణయించారు.

విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:40 ఉండాలి


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఆరిలోవ: పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:40 ఉండే విధంగా అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఐక్య కూటమి తరపున ఎస్టీయూ, పీఆర్‌టీయూ నాయకులు, హెచ్‌ఎం అసోసియేషన్ సభ్యులు మంగళవారం డీఈవో ఎస్.ప్రేమకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని అందులో పేర్కొన్నారు. అయితే విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:53 నిర్ణయించడం మాత్రం మంచి విధానం కాదన్నారు. దీని వల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. దీంతోపాటు తరగతి గదిలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయుల పర్యవేక్షణ కూడా లేకుండా పోతుందన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిరోధిద్దాం


గోనె సంచులను పంచుతున్న పట్టా రామ అప్పారావు

అగనంపూడి: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా విడిచిపెట్టాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు పిలుపునిచ్చారు. 'ప్లాస్టిక్ వాడకం తగ్గిద్దాం- పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో ఆయన అగనంపూడి కూడలిలో స్థానికులకు రూ.పదివేల విలువైన నార సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ అప్పారావు మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం భూమిని కలుషితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కవర్లు భూమిలో పేరుకుపోవడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకక నేరుగా సముద్రంలో కలిసిపోతోందని, దీనివల్ల భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించకపోతే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, అధ్యక్షుడు మారా మస్తాన్‌రెడ్డి, వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, ఇతర ప్రజా సంఘాల నాయకులు సోమేశ్వరరావు, విందుల పాపారావు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, నమ్మకూరి రమేష్, పాముల వసంతరావు, కసా పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి కథల బోధన


విద్యార్థులతో కథలను చదివిస్తున్న గ్రంథాలయాధికారి చంద్రకళ


విద్యార్థులకు కథలు చెబుతున్న లక్ష్మి

గాజువాక : గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు నీతి కథలను బోధించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ విద్యార్థులకు తెనాలి రామకృష్ణుడి కథలు చదివి వినిపించడంతోపాటు అందులోని నీతిని వివరించారు. అనంతరం విద్యార్థులతో కథలను చదివించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొడుపు కథల పోటీలు, పాటల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని వినియోగించుకొని జ్ఞానం, వినోదం పొందాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

కథలతోనే నీతి బోధన

పెదగంట్యాడ: విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించేవి కథలేనని ఎం.లక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం కథలు చెప్పారు. పిల్లలతో కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కథల్లో నీతి ఉంటుందని, దానిని చెప్పడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో నీతి నిజాయతీగా ఉంటారన్నారు. గతంలో చందమామ కథలను ఆసక్తిగా చదివేవారని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీ రమణ పాల్గొన్నారు.

ఘనంగా నృత్య పోటీలు

అగనంపూడి: అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వి.మధుసూధనరావు, కోఆర్డినేటర్ శివ రామకృష్ణ పాల్గొన్నారు.

నింగిలో వెన్నముద్దలా



నింగిపై వెన్నముద్దల్లా తేలియాడుతున్న మేఘాలు.. ప్రకృతి చిత్రలేఖనానికి నిదర్శనంగా నిలిచాయి. గాలుల ఊయలలో ఊగుతున్న తెల్లని మేఘాలు.. స్వచ్ఛమైన ఆకాశానికి అందమైన అలంకరణగా మారాయి. చూస్తుంటే కరిగిపోయే వెన్నముద్దల్లా కనువిందు చేశాయి. దూది పింజల్లా.. వెన్నముద్దల్లా.. ఆకాశంలో విహరిస్తున్న ఈ మేఘాలు.. ప్రకృతి ఒడిలో సాక్షత్కరించాయి. పెదగంట్యాడలో మంగళవారం సాయంత్రం ఈ మేఘదృశ్యం..వావ్ అనిపించింది.

-పెదగంట్యాడ

వాహనాలకు 'ఎస్' గుర్తు అతికించాలి


సెన్సిటివ్ రైడర్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, జేసీఐ స్టీల్‌సిటీ అధ్యక్షురాలు రమ్య

అగనంపూడి: విసుగు తెప్పించేలా హారన్లు కొడుతూ కొందరు వాహనాలను ఓవర్‌టేక్ చేస్తున్నారు. ఈ సమస్యను నివారించడానికి, తమ వాహనాలకు 'ఎస్' గుర్తును అతికించుకోవడం ద్వారా వెనుక వచ్చే వాహనదారులకు సున్నితంగా డ్రైవ్ చేయమని సూచించాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, జేసీఐ విశాఖ స్టీల్‌సిటీ అధ్యక్షురాలు జేసీ రమ్య అగస్తి కోరారు. డ్రైవింగ్ నేర్చుకునేటప్పుడు 'ఎల్' బోర్డును ఎలా ఉపయోగిస్తారో, అలాగే గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, హృద్రోగులు, బ్రెయిన్ స్ట్రోక్, వినికిడి లోపం ఉన్న వారు, వృద్ధులు తమ వాహనాలకు వెనుక వైపు 'ఎస్' గుర్తును కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు. దీనివల్ల వెనుక వచ్చే వాహనదారులు మరింత జాగ్రత్తగా ఉంటారని వారు అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై అవగాహన కల్పించడానికి 'సెన్సిటివ్ డ్రైవర్స్' పోస్టర్‌ను రూపొందించి ప్రచారం చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఈవూరి బుచ్చిరాజు, బలిరెడ్డి సత్యనారాయణ, యోగేష్‌కుమార్ గార్గే, మడుగల నరసింగరావు, గళ్లరాజు, గుదే సుశీలా గజేంద్రరావు, బొండా ఈశ్వరరావు, గొల్లవిల్లి కనక భవానీ, వెంకటరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సీతమ్మధార: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి వారికి మద్దతు నిలిచి మాట్లాడారు. ఆరోగ్య శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలన్నారు. వీరి పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.ఎస్.ఎన్. ప్రజ్ఞ, కార్యదర్శి గంట సుధ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా మొదలగునవి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి. సుధారాణి, పి.దివ్య, బి. శ్రావణి, టి.మోషే, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో అంబేడ్కర్ జయంతి


టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వీపీఏ చైర్‌పర్సన్ అంగముత్తు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి నిర్వహించారు. మంగళవారం వీపీఏ పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దార్శనికుడు అంబేడ్కర్ నాయకత్వంలో రూపొందించిన భారత రాజ్యాంగం దేశానికి మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిటోరియస్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీపీఏ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దుబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్.స్వామి, వీపీఏ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఎం.దేవీశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒ.రామలింగం, కార్యదర్శి జి.శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.